



పరీక్షలను పర్యవేక్షిస్తున్న విసి చింతా సుధాకర్

జిపిఎస్ వద్దే..వద్దు

అధికారంలోకి వచ్చిన వారంలోనే సిపిఎస్‌ను రద్దుచేసి ఒపిఎస్‌ను అమలు చేస్తామని పాదయాత్ర సమయంలో సిఎం జగన్‌మోహన్‌రెడ్డి మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన నాలుగున్నరేళ్ల తరువాత కొత్తగా జిపిఎస్‌ను తెరపైకి తీసుకొచ్చి అమలు చేశారు. దీనిపై ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఆయా సంఘాల నాయకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ జిపిఎస్‌ను అంగీకరించేది లేదని తెగేసి చెబుతున్నారు. ఒపిఎస్ అమలు కోసం అవసరమైతే ఆందోళన బాట పడుతామని చెబుతున్నారు. ఈనేపథ్యంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నేతల అభిప్రాయ మాలిక... - ప్రజాశక్తి-కడప అర్బన్

జిపిఎస్ గొడ్డలి పెట్టు



మా ప్రభుత్వం అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని సిఎం జగన్ మాట ఇచ్చి తప్పారు. సిపిఎస్, జిపిఎస్ ఉద్యోగులకు ఉపా ధ్యాయులకు పాత పెన్షన్ విధానం మాత్రమే అమలు చేసినప్పుడే ఉపశమనం పొందుతారు. ఉద్యోగులకు ఉపాధ్యాయులకు జిపిఎస్ అమలు వారి జీవితాలకు గొడ్డలి పెట్టు లాంటిదన్నారు. ఇటీవల ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద దేశవ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించాం. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వాం ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సిపిఎస్‌ను రద్దు చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఏదైతే నూతనంగా తీసుకువచ్చిన జిపిఎస్ కూడా రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. సిపిఎస్, జిపిఎస్ రద్దు చేసే వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తాం.

- లక్ష్మీరాజ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



ముఖ్యమంత్రి రాష్ట ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమ లు చేసి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామిని నిలబెట్టుకోవాలి. జిపిఎస్ విధానం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎటువంటి ప్రయోజనం లేదు. జిపిఎస్ విధానాన్ని ఉద్యో గులందరూ వ్యతిరేకిస్తున్నారు. ఈ విధానాన్ని ఎపిటియఫ్ తీవ్రంగా ఖండిస్తోంది. అనేక రాష్టాలు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్దరించడానికి ప్రయత్నాలు ప్రారంబిస్తున్న ప్రస్తుత పరిస్థితులలో మన రాష్టప్రభుత్వం జిపిఎస్ పేరుతో మరో కొత్త పెన్షన్ విధానాన్ని తీసుకురావడం సమంజసం కాదు. జిపిఎస్ విధానం సిపిఎస్ కంటే ఏరకంగాను మెరుగైన విధానం కాదన్నారు. పాతపెన్షన్ విధానం అమలుకు ఎపిటిఎఫ్ పోరాటం చేస్తుంది.

-ఎ.శ్యామ్ సుందర్ రెడ్డి,రాష్ట ఉపాధ్యక్షులు,ఎపిటిఎఫ్.

ఉద్యోగులకు నిలువునా మోసం



అధికారంలోకి వచ్చిన వారంలోపే సిపిఎస్‌ను రద్దు చేసి, ఒపిఎస్‌ను అమలు చేస్తామన్న ప్రస్తుత ముఖ్యమంత్రి హామీల అమలు నీటిమూటలయ్యాయి. ఇంతకాలం ఒపిఎస్ కోసం ఎదురు చూస్తున్న సిపిఎస్ ఉద్యోగుల నోట్లో మట్టి కొట్టి ,ప్రత్యామ్నాయంగా జిపిఎస్‌ను అమలు చేస్తామనడం విడ్డూరం. ఎటువంటి హామీ ఇవ్వని మనకంటే చిన్నరాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేస్తుంటే, హామీ ఇచ్చిన మన రాష్ట్రంలో మాత్రం తలాతోక లేని జిపిఎస్‌ను అమలు చేస్తామని చెప్పడం ప్రభుత్వ చేతకాని తనానికి నిదర్శనం. ఎట్టి పరిస్థితిలోనూ జిపిఎస్‌ను అంగీకరించబోం.

-పి.రమణారెడ్డి-ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు

జిపిఎస్‌ను ఖండిస్తున్నాం



ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. జిపిఎస్ వల్ల ఉద్యోగులకు ప్రయోజనం లేదు. సిపిఎస్ కోసం పోరాడుతూ ఉన్నాం. జిపిఎస్ ను తీవ్రంగా ఖండిస్తున్నాం. తమిళనాడులో సిపిఎస్ అమలు చేస్తూ ఉన్నారు. మన ప్రభుత్వమూ ఒపిఎస్‌ను అమలు చేయాలి.

- పి. మహబూబ్ ఖాన్, జిల్లా అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ఉర్దూ టీచర్స్ అసోసియేషన్.

జిపిఎస్‌ను ఆమోదించడం దారుణం



రాష్ట్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు భద్రతలేని, ఆమోదం లేని గ్యారెంటీ పెన్షన్ స్కీంను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించడాన్ని ఖండిస్తున్నాం. ఈ పెన్షన్ స్కీం పేరులోనే గ్యారెంటీ ఉంది కానీ పెన్షన్ ఇవ్వడంలో మాత్రం గ్యారెంటీ లేదు. ప్రతిపక్ష నేతగా ఉన్న సమయంలో సీఎం జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో సిపిఎస్ ను రద్దుచేసి ఓ పి ఎస్ ను అమలు చేస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలి. ఇచ్చిన హామీ ప్రకారంపాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలి.

- రాళ్లపల్లి అబ్దుల్లా ఎపిపిఎఫ్ 1938 రాష్ట కౌన్సిల్ సభ్యులు.

జిపిఎస్ బలవంతంగా రుద్దొద్దు



రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్ అమలు చేయకుండా జిపిఎస్ బలవంతంగా రుద్దవద్దు. అనేక రాష్ట్రాలు సిపిఎస్ అమలు చర్యలు తీసుకుంటూ ఉన్నాయి. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని నిలబెట్టుకోమని కోరుతూ ఉన్నాం. గ్యారెంటీ పెన్షన్ స్కీమ్‌లో ఉద్యోగులకు, ఉపాధ్యా యులకు గ్యారెంటీ లేదు. పాదయాత్ర సందర్భంలో వై.ఎస్.జగన్ ఇచ్చిన హామీని పక్క పెట్టి జిపిఎస్‌ను అమలు చేయడం దారుణం.

-సయ్యద్ ఇక్బాల్, 'రూట' రాష్ట ప్రధాన కార్యదర్శి

ఎరువులు ఎంఆర్‌పి ధరలకే అమ్మాలి

ప్రజాశక్తి - వల్లూరు



స్టాక్ వివరాలు తెలుసుకుంటున్న వ్యవసాయ సహాయ సంచాలకులు

దుకాణ దారులు ఎరువులను ఎంఆర్‌పి ధరల కంటే అధిక రేటుకు విక్రయి ంచరాదని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎ.వి. నరసి ంహారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని వల్లూరులో ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల దుకాణాల్లో రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎరువుల నిల్వలు, ఈ ఫోర్స్ మిషన్ నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లో బ్యాలెన్స్ వ్యత్యాసం లేకుండా చూసుకోవాలని తెలిపారు. వ్యవసాయ శాఖ ద్వారా అనుమతి పొందిన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు మాత్రమే అమ్మాలన్నారు. ప్రతి ఒక్క ఎరువుల దుకాణదారుడూ దుకాణంలో స్టాక్ బోర్డులో ఎరువుల ధరలను రాయాలని తెలిపారు కార్యక్రమంలో ఎరువుల దుకాణదారులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

కడప సిటీ : కడప నగరంలోని విజయ దుర్గ కాలనీలోని 4వ రోడ్డులో వరసిద్ధి వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం ఘనంగా నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు గోవిందు నాగరాజు, సంగినాధం ఆంజనేయులు, ఎసి కొండారెడ్డి, అడ్వకేట్ రాఘవరెడ్డి, పల్లా రాధాకృష్ణ, సిఆర్ఐ సునీల్ జయంత్, జయరామిరెడ్డి రాజారెడ్డి, గణేష్, సిఆర్ఐ పెద్ద సుబ్బరాయుడు, చౌడం వెంకటేష్, విజయదుర్గా కాలనీ వాసుల ప్రజలు, మహిళలు సంఖ్యలో పాల్గొన్నారు.



విజయదుర్గా కాలనీలో వినాయకుడిని ఊరేగిస్తున్న స్థానికులు

స్వచ్ఛమైన ఓటరు జాబితాకు సహకరించాలి

- కలెక్టర్ వి.విజయ్‌రామరాజు

ప్రజాశక్తి - కడప

జిల్లాలో స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలని, పోలింగ్ స్టేషన్ల సమస్యలు ఉంటే వెంటనే తెలియ జేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో ఓటర్ల జాబితా పరిశీలనపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి కలెక్టర్ తోపాటు జెసి గణేష్ కుమార్, కడప నగర మేయర్ సురేష్ బాబు, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ డిఆర్వో గంగాధర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల చేర్పులు మార్పులు, తదితర సమస్యలపై వెంటనే తెలియజేయాలన్నారు. ఓటరు జాబి తా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తయి ందని, డెత్, షిఫ్టెడ్, రిపీటెడ్ ఓట్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించామని చెప్పారు. జిల్లా లో ఓటర్ జాబితాకు సంబంధించి అందిన క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పక్కాగా పరిశీలన



రాజకీయ ప్రతినిధులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

చేస్తున్నామన్నారు. రాజకీయ పార్టీల ప్రతి నిధులందరూ తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో డిలీట్ అయిన ఓట్లను బిఎల్‌ఒలు పోలింగ్ స్టేషన్ వారీగా పరిశీలించామని చెప్పారు. జంక్ ఓటర్లను పరిశీలిస్తున్నామని ఇంకా ఎక్కడైనా ఒకే డోర్ నెంబర్‌లో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అన ంతరం నియోజకవర్గాల వారీగా వివిధ అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ చర్చించారు. కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు బి. హరిప్రసాద్ కాంగ్రెస్ దాసం, జి. లక్ష్మీ రావు , ప్రసాద్ గౌడ్ , డా.బి శ్రీనివాసులు, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్‌డిఒలు ధర్మచంద్రారెడ్డి, శ్రీనివాసులు, వెంకట రమణ, వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ జ్ఞానేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

జర్నలిస్టులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి

- ఎస్‌పికి జర్నలిస్టు సంఘాల వినతి

ప్రజాశక్తి-కడప సిటీ

కడప జిల్లా వేంపల్లి మండల విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎస్పి సిద్దార్థ కౌశల్‌కు గురువారం జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఇసుక అక్రమ రవాణా చేస్తుంటే కవరేజీ చేయడానికి వెళ్లిన 9 మంది విలేకరులపై అక్రమ కేసులు బనాయించారని ఎస్‌పికి సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తున్న ప్రాంతంలో అనుమతులు లేవని స్వయానా స్థానిక రెవెన్యూ అధికారులు చెబుతున్నప్పటికీ జెపి కన్‌స్ట్రక్షన్ వారు ఇసుకను తరలిస్తున్న విషయాన్ని ఎస్‌పికి జర్నలిస్టు సంఘాల నేతలు రామసుబ్బారెడ్డి, నారాయణ, శ్రీనాథ్‌రెడ్డి వివరి ంచారు. ఫిర్యాదుదారుడు తన ఫిర్యాదులో జర్నలిస్టులు పనిచేసే సంస్థల పేర్లను నమోదు చేయకున్నా వేంపల్లె ఎస్ఐ తిరుపాల్ నాయక్ అత్యుత్సాహంతో మీడియా సంస్థల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారని వారు ఎస్‌పి దృష్టి తీసుకువచ్చారు. జర్నలిస్టు సంఘాల నేతల వాదనకు ఎస్‌పి సిద్ధార్థ కౌశల్ స్పందిస్తూ జర్నలిస్టులపై పెట్టిన అక్రమ కేసులపై విచారణ చేయించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. మీరు, తాము కలిసి పనిచేయాల్సి ఉందన్నారు. జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. కార్యక్రమంలో ఎపియుడబ్ల్యుజె, ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు రామాంజనేయులురెడ్డి, నూర్‌బాషా, రాజు, సిద్ధయ్య, బాలకృష్ణ, సుదర్శన్, శివకేశవరెడ్డి, సుబ్బారెడ్డి, జర్నలుస్టులు జయచంద్ర, ఎ.వి.సుబ్బారెడ్డి, రఘునాధరెడ్డి, ఖదీర్, గఫార్, రహీంతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



ఎస్‌పికి వినతిపత్రం సమర్పిస్తున్న జర్నలిస్టు సంఘాల నాయకులు

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

- యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కూరగాయల బిల్లులు, గ్యాస్ బిల్లులు, ఆరు నెలల నుంచి పెండింగ్ ఉన్న సెంటర్ అద్దె బిల్లులు, నాలుగు సంవత్సరాల నుంచి టిఎ, డిఎ బిల్లులు తక్షణమే చెల్లించకపోతే రానున్న కాలంలో రాష్ట్రస్థాయిలో ఆందోళన, పోరా టాలకు శ్రీకారం చుడుతామని ఆంధ్రప్రదేశ్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.లక్ష్మీదేవి, బి.లక్ష్మీదేవి తెలిపారు. గురువారం సిఐటియు జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 13 ప్రాజెక్టులున్నాయని చెప్పారు. చాలా సమస్యలతో అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్స్, మినీ వర్కర్స్ ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. జీతాలు సరిగ్గా రానటువంటి పరిస్థితి నెల కొందన్నారు. కూరగాయల, గ్యాస్ బిల్లులు, సెంటర్ అద్దెలు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీలచే అన్ని రకాల పనులు చేయించుకుంటున్నారని విమ ర్శించారు. సమస్యలను ఎందుకు పరిష్కరించరని ప్రభుత్వాన్ని ప్రశ్నిం చారు. అంగన్వాడీ కార్యకర్తలు అప్పులు తెచ్చి సెంటర్లు నడుపు తున్నారని చెప్పారు. 2017 నుంచి టిఎ, డిఎలు ఇవ్వడం లేదని తెలిపారు. నెలలో రెండు మూడు సార్లు మీటింగ్‌లకు పిలుస్తున్నారని, ఫ్రీ స్కూలు కిట్టు, రిజిస్టర్లు, యూనిఫామ్ తామే తెచ్చుకోవడంలో ఆటో ఛార్జీలు ఖర్చు అవుతున్నాయని పేర్కొన్నారు. అలాగే ఒక్కో సెంటర్‌లో బియ్యం, 300 నుంచి 400 కిలోలు నిల్వ ఉన్నాయని, కందిపప్పు స్టాకు ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. అయినా ప్రతి నెలా కొత్తగా బియ్యం, కందిపప్పు, నూనె సప్లయ్ చేస్తున్నారని దీనివల్ల పాత స్టాకు పురుగు పడుతోందని తెలిపారు. చాలా ప్రాజెక్టులలో 2017 సంవత్సరం నుంచి వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాలేదని తెలిపారు. వెంటనే పెండింగ్‌లో ఉన్నటువంటి రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కడప అర్బన్ ప్రాజెక్ట్ నాయకురాలు శాంతి, ఎర్రగుంట్ల మండల నాయకురాలు పి. ఉమాదేవి పాల్గొన్నారు.

84 పరుగుల తేడాతో కడప జట్టు విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్- 19 ఇంటర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా గురువారం కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టుపై 84 పరుగుల తేడాతో కడప జట్టు ఘన విజయం సాధించింది. టాస్క్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 46.3 ఓవర్లలో 238 పరుగులకు ఆల్ అవుట్ అయింది. ఆ జట్టులోని సి. విజయ్ రామిరెడ్డి 99 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టులోని సి.యోచన్ శ్వేతార్క్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ సెంట్రల్ జోన్ జట్టు 29.0 ఓవర్లలో 154 పరుగులకు ఆల్ అవుట్ అయి ఓటమి చెందింది. ఆ జట్టులోని ఎం అభినవ్ 48 (నాటౌట్) పరుగులు చేశాడు. కడప జట్టులోని ఎస్.ఎం.డి. ఆయూబ్ బౌలింగ్‌లో అద్భుతంగా రాణించి 6 వికెట్లు తీసుకున్నాడు. బి. ప్రణవ్ 2 వికెట్లు తీసుకున్నాడు. **70 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం** వైఎస్‌రాజారెడ్డి స్టేడియంలో జరిగిన వెరొక మ్యాచ్‌లో రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టుపై 70 పరుగుల తేడాతో రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఆ జట్టులోని జి.జె.ఎస్. పృథ్వీరాజ్ 47 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టులోని టీ. ప్రదీప్ రెడ్డి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 176 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కు దిగిన రెస్ట్ ఆఫ్ సౌత్ జోన్ జట్టు 35.3 ఓవర్లలో 105 పరుగులకు ఆల్ అవుట్ అయి ఓటమి చెందింది. ఆ జట్టులోని వెంకట్ లోకేష్ 30 పరుగులు చేశాడు. రెస్ట్ ఆఫ్ నార్త్ జోన్ జట్టులోని టీ.వీ.ఎస్. శ్రీరామ్ 4, ఏ.ఎన్.వి. లోహిత్ 3 వికెట్లు తీసుకున్నారు. **వర్షం కారణంగా ఆగిన మ్యాచ్...** కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో విశాఖపట్నం, గుంటూరు జట్ల మధ్య జరగాల్సిన మ్యాచ్ బుధవారం రాత్రి కురిసిన వర్షం కారణంగా మైదానం ఆటకు అణువుగా లేకపోవడంతో మ్యాచ్ ఆగిపోయింది.

ప్రగతి లక్ష్యాలను సాధించాలి

కడప : సుస్థిర అభివృద్ధి ప్రగతిలో వందశాతం లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ వి. విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి వివిధ శాఖల కార్యదర్శులతో కలిసి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, జగనన్న ఆరోగ్య సురక్ష, గ్రామవార్డు సచివాలయాల సేవలు, ఐసిడిఎస్ పథకాలు, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కె.ఎస్. జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేశారు. కడప కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ , జెసి జి. గణేష్ కుమార్ హాజురయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 10-19 మధ్య వయసున్న బాలికల్లో రక్తహీనతను నివారించడానికి అధికారులు బాధ్యతగా కృషి చేయాలన్నారు. స్టెంటెడ్ చిల్డ్రన్, బరువు తక్కువ ఉన్న పిల్లల విషయంలోనూ ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాల మేర చికిత్స అందించడంతో పాటు సమగ్ర పోషక ఆహారాన్ని ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేయాలన్నారు.

మాట తప్పడం తగదు

కడప అర్బన్ : అధికారంలోకి వచ్చిన వారంలోనే సిపిఎస్‌ను రద్దుచేసి, ఒపిఎస్‌ను అమలు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి మాట తప్పి, ఉద్యోగులను మోసం చేయడం తగదని ఎస్‌టియు జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.రమణారెడ్డి, వై.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. గురువారం కడపలోని వివిఆర్ ఎస్‌టియు భవన్‌లో వారు మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా పాదయాత్ర సమయంలో ఇడుపుల పాయ నుండి ఇచ్ఛాపురం వరకు సిపియస్‌ను రద్దు చేసి, వెంటనే ఒపిఎస్‌ను అమలు చేస్తామని చెప్పిన మాటలు నీటి మూటలుగా మారిపోయాయని చెప్పారు. ఉద్యోగుల నోట్లో మట్టి కొట్టేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వ తీరుపై ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదనతో రగిలి పోతున్నారన్నారు. ఎటువంటి పరిస్థితులలో జిపిఎస్‌ను అంగీకరించేది లేదన్నారు. 11వ పిఆర్‌సి విషయంలోనూ ఇదే మాదిరి కమిటీ నివేదిక బయటపెట్టకుండా, బలవంతంగా అమలు చేశారని వాపోయారు.

పీజీ, లా పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగివేమన విశ్వవిద్యాలయ పీజీ నాలుగో (చివరి) సెమిస్టరు పరీక్షలు, మూడేళ్ల ఎల్ఎల్‌బి, ఐదేళ్ల ఎల్ఎల్‌బి సెమిస్టర్ల పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్ రఘునాథ్ రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి విస్తృత తనిఖీ చేశారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆర్ట్స్ బ్లాక్, సైన్స్ బ్లాక్, కామర్స్, మేనేజ్మెంట్ బ్లాక్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఎల్ఎల్బీ పరీక్షలు రాసే విద్యార్థులతో సందడి వాతావరణం నెలకొంది. ఈసారి పరీక్ష విధుల్లో ప్రతి ఒక్కరిని బాధ్యులుగా చేయడంతో అన్ని శాఖల్లోనూ పరీక్ష సమయాల్లో హడావుడి కనిపిస్తోంది. పరీక్షల వికేంద్రీకరణ వల్ల చదువుతున్న తరగతి గదుల్లో, ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు సంతోషంగా పరీక్షలు రాస్తున్నారు. ఉదయం 10 గంటలకు పరీక్షలు ప్రారంభం కానుండడంతో అధ్యాపకులు, సిబ్బంది విశ్వవిద్యాలయ పనివేళల కంటే ముందుగా వచ్చి విద్యార్థుల పరీక్షల కు సంబంధించిన ఏర్పాట్లు చూస్తున్నారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖల సహాయ ఆచార్యులు, సహా ఆచార్యులు, ఆచార్యులు, బోధ నేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - కడప



పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపల్, అధ్యాపకులు

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల శు భ్రత పాటించాలని ప్ర భుత్వ పురుషుల కళా శాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ అన్నారు. గురువారం కడప ప్రభుత్వ పురు షుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వ హించారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న స్వచ్ఛత పక్వాడ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పురుషుల కళాశాలలో ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో స్వచ్ఛత ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వై. సావిత్రి మాట్లాడుతూ స్వచ్ఛత ప్రతిజ్ఞ ద్వారా ప్రతి ఒక్కరూ కూడా 100 గంటలు పరిశుభ్రత కార్యక్రమాలకు చేపట్టాలని తెలిపారు. జంతు శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పి.రవిశేఖర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కూడా పరిశుభ్రతలో భాగ స్వాములవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రమేష్, అధ్యాపకులు డాక్టర్ డి నాగేంద్ర కుమార్ మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంబిబిఎస్ అడ్మిషన్లు రద్దు చేయాలని వినతి

ప్రజాశక్తి - కడప



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించిన ఎంబిబిఎస్ రెండో విడత కౌన్సెలింగ్‌ను రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు వై.విష్ణు ప్రీతంరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు గురువారం కలెక్టర్ విజయ్ రామరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 54000 ర్యాంకు వచ్చిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు రిజర్వేషన్ కేటగిరిలో సీట్లు కేటాయించి, 62000, 60000 పైన ర్యాంకు వచ్చిన విద్యార్థులకు ఓపెన్ కేటగిరీలో సీట్లు కేటాయించడం వల్ల చాలామంది రిజర్వేషన్ కేటగిరీలో సీట్లు పొందాల్సిన విద్యార్థులు నష్టపోయారని, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ విద్యార్థులకు అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు నిబం ధనల ప్రకారం మొదటగా జనరల్ కేటగిరి కౌన్సెలింగ్ నిర్వహించి ర్యాంకర్‌కు సీటు కేటాయించాలన్నారు. మొత్తం కౌన్సెలింగ్ పద్ధతిని రద్దుచేసి మళ్లీ నిర్వహించాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లలో వినతి పత్రాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. స్పందించిన కలెక్టర్ ఈ విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మధు రెడ్డి, అలీ ఖాన్, పుల్లయ్య, వాళ్లకి శివ, ఖాదర్ ఖాన్, ఇండ్లురి కృష్ణారెడ్డి, మామిళ్ళ బాబు, కొప్పూరి శ్రీనివాసులు, చంద్ర, ఫారూఖ్, శంకర్ పాల్గొన్నారు.

వాగులు, వంకలను కాపాడాలి

ప్రజాశక్తి - కడప

కడప నగరంలో చెరువులు, కుంటలు, వాగులు, వంకలు ఆక్రమణకు గురికాకుండా వాటిని కాపాడాలని కోరుతూ గురువారం కలెక్టర్ విజయ్ రామరాజుకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్, ఏఐసీసీ సభ్యులు బండి జకరయ్య వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప నగరం వేగంగా విస్తరిస్తూ ఉంది అన్నారు. ఇప్పటికే మృత్యుంజయ కుంట, కుమ్మరి కుంట, గురువిరెడ్డి కుంట, రామరాజు పల్లి చెరువు పూర్తిగా ఆక్రమణకు గురయ్యాయని తెలిపారు. నగరంలోని ప్రజలు తమ అవసరాల కోసం వేసే నీటి బోర్ల వల్ల, అభివృద్ధి పేరుతో సిమెంటు రోడ్డు కాంక్రీట్ నిర్మాణాలు పూర్తిగా నిండి పోయాయని అన్నారు. దీనివల్ల వర్షపు నీరు ఇంకిపోనందున భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి అని తెలిపారు. కడప నగర శివారు ప్రాంతాలైన పాత కడప చెరువు, పుట్లంపల్లి చెరువు ,పాలెం పల్లె చెరువు, బచ్చుంపల్లి చెరువు, ఊటుకూరు చెరువు కబ్జాదారుల చేతుల్లో పడి ఆక్రమణలకు గురవుతున్నాయని వాపోయారు. కడప నగరంలో కురిసే వర్షపు నీరు వృధా కాకుండా నగరంలోని చెరువులలోకి మళ్లించాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి-కదిరి ప్రసాద్, ఆనందు, ముస్లిం సంఘం నాయకులు షకీల్, మైనారిటీ సెల్ నాయకులు ఆసిఫ్ ఖాన్, బాబు, రఫీ పాల్గొన్నారు.

నేడు ఆర్ట్స్ కళాశాలలో ఎన్‌సిసి ఎంపికలు

కడప : 30 ఆంధ్ర బెటాలియన్ వారిచే 2023-24 సంవత్సరానికి ఆర్ట్స్ కళాశాల ఆవరణంలో శుక్రవారం ఎన్‌సిసి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడానికి, ఉత్తమ పౌరునిగా ఎదగడానికి ఎన్‌సిసి చక్కటి అవకాశం అని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి సమాచారం కోసం కళాశాల ఎన్.సి.సి అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య, లెఫ్టినెంట్ మహేష్ ల ద్వారా పొందవచ్చని తెలిపారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కడప : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ లో 30 రోజులపాటు, సెల్‌ఫోన్ రిపేర్లు, సర్వీసింగ్ లో 30 రోజులపాటు, సిసిటివి కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్ కోర్సులలో 13 రోజులపాటు అక్టోబర్ మూడవ తేదీ నుండి గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. పై తెలిపిన కోర్సులలో ఉచిత శిక్షణ పొందాలనుకున్నవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9440905478, 9985606866లలో సంప్రది ంచాలన్నారు.

రేపు ఉద్యోగమేళా

ప్రజాశక్తి - కడప

జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 23న ఉదయం 10:00 గంటలకు కలెక్టరేట్ లోని డి-బ్లాక్‌లో ఉన్న జిల్లా ఉపాధి కార్యాలయంలో రెండు ప్రముఖ కంపెనీలతో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి ఎ. సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ ఆర్ హెచ్ నెక్స్ట్, జి జె సొల్యూషన్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలలో వాయిస్ అండ్ నాన్ వాయిస్, ఇ-మాల్ చాట్ ఉద్యోగాల కోసం ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పై పేర్కొన్న కంపెనీలలో వివిధ హోదాల్లో పని చేసేందుకు విద్యార్హత పదవ తరగతి, ఇంటర్ ఏదైనా డిగ్రీ పాసై ఉండాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు వారి హోదాను బట్టి నెలకు రూ. 11 వేల నుండి కే, 18 వేల వరకు వేతనం ఇస్తారని పేర్కొన్నారు. జాబ్ మేళాకు హాజరయ్యే ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు విద్య అర్హతలకు సంబంధించిన ధ్రువ పత్రాలు, ఫొటోలు తీసుకు రావాలని కోరారు.


పనులను పరిశీలిస్తున్న ఓఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి

గడువులోగా పనులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మోడల్ టౌన్‌లో భాగంగా పులివెందుల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. ఆ పనుల పురోగతిని గురువారం ఆయన పట్టణ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్‌తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. మినీ సెక్రటేరియట్, సిటీ సెంట్రమ్, ఇంటర్నల్ రోడ్స్, రింగ్‌రోడ్ పనులు పరిశీలించారు. పనులు చేయకుండా ఆలస్యం చేస్తే కాంట్రాక్టర్లు బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం కృష్ణాలయం, శిల్పారామం, గురుకుల పాఠశాల, అగ్రికల్చర్, హార్టికల్చర్ కళాశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ కళాశాల ప్రిన్సిపల్ సుశీల, అగ్రికల్చర్ ప్రిన్సిపల్ ఎంవిఎస్ నాయుడు వద్ద నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కళాశాలలకు సంబంధించిన కంప్యూటర్స్, ఇంటర్నెట్ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని వారికి వివరించారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా తరగతి, హాస్టల్ గదులు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్అండ్‌బి ఇఇ సిద్దారెడ్డి, డిఇ జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు పోలీస్ హౌసింగ్ డిఇ మురళీకృష్ణ, ఎండోమెంట్ డిఇ గంగయ్య, మోడల్ టౌన్ అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

- మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరమని మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరుడికి 21 సంవత్సరాలు, వధువుకు 18 ఏళ్లు నిండి ఉండాలన్నారు. పట్టణంలో కళ్యాణ మండపాలు, మసీదులు, చర్చిలు నిర్వహించు వారు ఆ నిబంధనలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. వధూవరుల ఆధార్ కార్డులోని వయసు నిర్ధారణ పత్రాలు రిజిష్టర్ చేసుకుని వివాహాలు చేయాలన్నారు. మైనర్లకు వివాహం జరుగుతుంటే సమాచారం టోల్ ఫ్రీ నెంబర్ 1098కి, ఏదైనా సచివాలయానికిగానీ తెలియజేయాలన్నారు.

పంట నమోదు రైతు బాధ్యత

ప్రజాశక్తి - ముద్దనూరు

సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేసుకోవడం రైతు బాధ్యత అని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో గురువారం ఎఒ మాట్లాడుతూ మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన అన్ని పంటలను నమోదు చేశామన్నారు. ఇప్పటివరకు మొత్తం 3,640 మంది రైతులకు సంబంధించి 10,459 ఎకరాల్లో పంట నమోదు చేసినట్లు చెప్పారు. పంట నమోదు కానీ రైతులు ఈనెల 30వతేదీలోపు చేసుకోవాలన్నారు. అనంతరం రబీ సీజన్ కింద పరిగణనలోకి తీసుకుని పంట నమోదు చేస్తామన్నారు. పంట నమోదు చేయించుకున్న ప్రతి రైతు ఇకెవైసి చేయించుకోవాలన్నారు. పంట నమోదు, ఇకెవైసి చేయించుకున్న రైతులకు పథకాలు వర్తిస్తాయని ఎఒ తెలిపారు.

ప్రజా సంక్షేమమే జగనన్న ధ్యేయం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి ఆదేశాల మేరకు మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం మునిసిపాలిటీ పరిధిలోని ఇస్లాం పురం ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గుంత బజార్ సచివాలయ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి వెళ్లి జగనన్న ప్రభుత్వంలో జరిగిన మంచిని వైఎస్ మనోహర్‌రెడ్డి ప్రజలకు వివరించారు. జరగబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డికి మద్దతివ్వాలని ఆయన కోరారు. కార్య క్రమంలో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాల్ గంగాధర్ రెడ్డి, వైస్ చైర్మన్ హాఫీజ్, ఓతూరు రసూల్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్, జెసిఎస్ కన్వీనర్, మున్సిపల్ కమిషనర్ నరసింహరెడ్డి, శానిటేషన్ అధికారి మురళి, టౌన్ ప్లానింగ్ అధికారి అజయ్, మెప్మా సిబ్బంది, సచి వాలయ, రెవెన్యూ సిబ్బంది, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మాజీ కౌన్సిలర్లు, బూత్ కమిటీ, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

రాజధాని తరలింపు నిర్ణయం చారిత్రాత్మక తప్పిదం : పిసిసి


ప్రజాశక్తి - వేంపల్లె

విజయదశమికి రాష్ట్ర రాజధాని అమరావతి నుండి విశాఖకు తరలించే పని పూర్తి కావాలని వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మక తప్పిదమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రస్తుత రాష్ట్ర రాజధాని అమరావతి రాష్ట్ర నడి బొడ్డున అన్ని ప్రాంతాల వారికి అందుబాటులో ఉందన్నారు. ఎనిమిదేళ్లుగా అమరావతి నుండి పరిపాలన సాగుతోందన్నారు. రాష్ట్ర సచివాలయ భవనం వంద శాతం పూర్తయిందన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులు, అధికారులు పాలన కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే రాజధాని కోసం రూ.10 వేల కోట్లు ప్రజాధనాన్ని ఖర్చు చేశారన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజధానిని మార్చాలనే నిర్ణయం ఏ మాత్రం సమంజసం కాదన్నారు. రాజధానిని విశాఖకు తరలిస్తే రాయలసీమ వాసులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర రాజధానిని మార్చే నిర్ణయాన్ని జగన్ విరమించుకోవాలని ఆయన కోరారు. ఒకే రాజధాని, ఒకే రాష్ట్రం అదే అమరావతి ఇదే కాంగ్రెస్ నినాదం అన్నారు.

అధ్వానం.. తవ్వారిపల్లె దళితవాడ రోడ్డు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి పనుల కోసం కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేస్తున్నా, క్షేత్ర స్థాయిలో సమస్యలు మాత్రం ఎక్కడి కక్కడ పరి ష్కారానికి నోచుకోవడంలేదు. ఇప్పటికీ పలు గ్రామాల్లో సరైన రహదారులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దళిత కాలనీల అభివృద్ధికి గత ప్రభుత్వం ఎస్సీ,ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను పెద్ద ఎత్తున ఖర్చు చేసినా ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయింది. ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నిధులను వినియోగించారు తప్ప రహదారులు మాత్రం ఏర్పాటు చేయలేదు. వివరాల్లోకెళ్తే.. మండల పరిధిలోని తవ్వారిపల్లె గ్రామ దళితవాడ సమస్యలతో కొట్టు మిట్టాడుతోంది. ఈ కాలనీలో సిమెంట్ దారులు లేకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి వర్షం వస్తే వీధులన్ని తటాకాలను తలపిస్తుంటాయని రాకపోకలు సాగించేందుకు కష్టతరంగా ఉంటుందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమెంటు దారులు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని, ప్రజా ప్రతినిధులు సైతం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సిమెంట్ దారులు ఏర్పాటు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.


సిసి రోడ్డుకు నోచని దళితవాడ వీధి

తూతూ మంత్రంగా పందుల నిర్మూలన

రోగాల పాలవుతున్న ప్రజలు.. నిర్లక్ష్యంగా మున్సిపల్ యంత్రాంగం


ఈడిగపేటలో సంచరిస్తున్న పందులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణ ప్రజలు అనారోగ్యానికి గురైనప్పుడే మున్సిపల్ అధికారులకు పరిశుభ్రత, పారిశుధ్యం గుర్తుకొస్తోంది. నిత్యం పట్టణంలో రద్దీగా ఉండే జనావాసాల మధ్య పందులు స్వైర విహారం చేస్తున్నా.. మున్సిపల్ పారిశుధ్య యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు విమర్శలకు దారితీస్తోంది. పట్టణంలో కొన్నేళ్ల తరబడిగా సీజనల్ సమయంలో పట్టణానికి ఏదోక మూల ప్రజలను డయేరియా, మలేరియా, టైఫాయిడ్, అతిసార వంటి వ్యాధులు ప్రబలుతూనే ఉంటున్నాయి. ఆ సమయంలో అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్ప.. వాటిపై చర్యలు తీసుకోవడం లేదనడానికి ఈ పందుల స్వైర విహారమే నిదర్శనం. ఇటీవల పట్టణంలో పందుల నిర్మూలన చేపడతామని తెలిపారు. కానీ ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదు. పందుల పెంపకం దారులకు నోటీసులు జారీ చేశామన్నారు. ఆ మేరకు అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప, పందుల నిర్మూలనపై చర్యలు చేపట్టిన దాఖలాల్లేవు.

ఫిర్యాదులు అందినా షరా మామూలే..!

ముఖ్యంగా జమ్మలమడుగు పట్టణంలోని ఈడిగపేటలో పందులు యథేచ్ఛగా తిరుగుతున్నాయని మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా.. వారు స్పందించకపోవడంతో సోషల్ మీడియాలో పోస్టు సైతం పెట్టి తమ నిరసన జమ్మలమడుగు ప్రజలు తెలుపుతున్నారు. గతంలో మున్సిపల్ కౌన్సిలర్లు పలుమార్లు పందుల స్వైరవిహారంపై చర్యలు తీసుకోవాలని తీర్మానాలు చేశారు. అయినా వాటిపై దృష్టి పెట్టలేదనే ఆరోపణలున్నాయి. పందుల సంచారం వల్ల ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉన్నందున, ఇప్పటికైనా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మున్సిపల్ అధికారులు స్పందించాల్సి ఉంది. పట్టణంలో పందుల సంచారం లేకుండా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

రోగాలు ప్రబలుతున్నా పట్టని అధికారులు



పందుల స్వైరవిహారం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. నగర పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదు. పట్టణంలో ఏ మూల చూసినా పందులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. చర్యలు తీసుకోకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారు. వాటిని పట్టించుకున్న పాపానపోలేదు.

- విజయ్, సిఐటియు నాయకులు జమ్మలమడుగు

దిగుబడి లేదని.. వేరుశనగ పంట దున్నివేత

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంట దిగుబడి లేకపోవడంతో రైతులు దున్నేస్తున్నారు. మండలంలోని గురిజాల గ్రామంలో రైతు ద్వారకనాథరెడ్డి తాను సాగు చేసిన 5 ఎకరాల పొలంలోని వేరుశనగ పంటను (రోటోవేటర్) చెడగొట్టాడు. పంట సాగు సమయంలో అరకొరగా వర్షాలు పడడంతో రైతులు పంట సాగుకు ఉపక్రమించారు. మండల వ్యాప్తంగా దాదాపు 300 ఎకరాల్లో పంటను సాగు చేశారు. పంట సాగు అనంతరం వర్షాలు కురువకపోవడంతో ఒక దశలో పంట ఎండు దశకు చేరుకుంది. ఇటీవల 15 రోజులు క్రితం వర్షం కురిసినప్పటికీ దిగుబడి లేదని రైతులు నిరాశతో దున్నేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి పంట సాగు చేసిన రైతులకు పరిహారం ఇవ్వాలని బాధిత రైతులు కోరుతున్నారు.



నవయుగ వైతాళికుడు 'గురజాడ'కు ఘననివాళి



కడప : గురజాడ జయంతి సందర్భంగా జెవివి నాయకుల ర్యాలీ

ప్రజాశక్తి- కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో విశ్వవిద్యాలయ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు గురువారం నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు 162వ జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారులలో గురజాడ ఒకరని అన్నారు. ప్రజలందరికీ అర్థమయ్యే వాడుక భాషలో రచనలు చేశారని, ఆయన రచించిన కన్యాశుల్కం నాటకానికి సాహితీ లోకంలో ఒక ప్రత్యేకమైన స్థానం ఉందన్నారు. శ్రీశ్రీ అడుగుజాడ గురజాడని కీర్తించడమే కాక తన దృష్టిలో కవిత్రయమంటే 'తిక్కన, వేమన, గురజాడ' అని పేర్కొన్నారన్నారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ గురజాడ అప్పారావు గిడుగు రామమూర్తితో కలిసి వాడుక భాషా వ్యాప్తికి ఉద్యమించారన్నారు. ఆ రోజుల్లో ప్రబలంగా ఉన్న కన్యాశుల్కం, వేశ్యావృత్తి వంటి దురాచారాలపై విమర్శ ఈ నాటకానికి కథావస్తువని అన్నారు. 1910లో ఆయన రాసిన 'దేశమును ప్రేమించుమన్నా' అనే దేశభక్తి గీతం విశ్వకీర్తిని గడించిందన్నారు. ఆయన 1896లో 'ప్రకాశిక' అనే పత్రికను ప్రారంభించారన్నారు. రచయిత కొత్తపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ కన్యాశుల్కం నాటకపు తొలి ప్రదర్శన 1892లో జరిగిందని, 1897లో కన్యాశుల్కం తొలి కూర్పును మహారాజా ఆనందగజపతికి అంకితమిచ్చారని, ఇప్పుడు మనకు దొరుకుతున్న కన్యాశుల్కం రెండవ కూర్పును 1909లో రచించారన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ మౌనిక, సిబ్బంది చంద్రకిశోర్, రాణి, పాఠకులు రంగ పాల్గొన్నారు. **జెవివి ఆధ్వర్యంలో..** గురజాడ ఆశయాలను సాధించాలని జెవివి రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ పిలుపునిచ్చారు. గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గురజాడ వెంకట అప్పారావు జయంతి కార్యక్రమాలు స్థానిక గాంధీనగర్, మున్సిపల్ హై స్కూల్, రవీంద్ర నగర్ విద్యా నికేతన్ ఎయిడెడ్ స్కూల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురజాడ అప్పారావు 1910లో దేశమును ప్రేమించుమన్నా రాశాడని, ఎందుకు రాశాడు అన్న దానికి ఆనాటి స్వాతంత్ర పోరాటం, బెంగాల్ విభజన తదితర అంశాలలో. ప్రజలు చీలిపోయారని తెలిపారు. కులం, మతం లాంటివి ముందు కొచ్చాయని పేర్కొన్నారు. ప్రజలు స్వాతంత్ర్య ఆశయ సిద్ధి కంటే మత విష యాలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయని చెప్పారు. సమాజాన్ని ముం దుకు తీసుకెళ్లాలంటే మనిషి పునాదిగా ఉండాలని పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక రెండు తెలుగు రాష్ట్రాలలో స్కూలు, పిల్లల, ప్రజల మధ్య కార్యక్రమాలు నిర్వహించిందని చెప్పారు. ఆ క్రమంలో కడప గాంధీ నగర్ మున్సిపల్ హై స్కూల్ హెచ్ఎం సత్య సుజాత, ఇంగ్లీష్ టీచర్ రూత్ ఆరోగ్య మేరీ, తెలుగు టీచర్లు శోభారాణి, శశిరేఖ, కిరణ్ కుమార్, విద్యానికేతన్ స్కూల్ జెవివి రాష్ట్ర కోశాధికారి బి. రాజశేఖర్ రాహుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** సాంఘిక పరివర్తనకు యత్నించిన మహాకవి గురజాడ అప్పారావు అని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. గురజాడ అప్పారావు జయంతిని డివైయఫ్ఐ ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు గీతం కాలేజీలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకరులలో ఒకరు గురజాడ అన్నారు. గురజాడ గొప్ప హేతువాది అన్నారు. సమాజంలో జరుగుతున్న దూరాచారాలను తన సాహిత్యం ద్వారా వెలుగెత్తి చాటేవారన్నారు. 19,20 శతాబ్ది కాలంలో ఆయన రచనలు నేటికీ ప్రజల మన్ననలు పొందుతున్నాయన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షులు వెంకటేష్, నాయకులు రమేష్, పక్కీరయ్య పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** మహాకవి గురజాడ అప్పారావు సామాజిక సంఘ సంస్కర్త అని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్ తెలిపారు. గురువారం డివైఎఫ్.ఐ ఆధ్వర్యంలో స్థానిక పి.ఆర్ హైస్కూల్‌లో గురజాడ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, జగన్ విద్యార్థులు పాల్గొన్నారు. **వేంపల్లె :** నేడు ఆధునిక భారతదేశం ఎదుర్కొంటున్న సమకాలీన సామాజిక సమస్యల పరిష్కారానికి దారి చూపిన దార్శనికుడు గురజాడ అప్పారావు అని వక్తలు పేర్కొన్నారు. గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా గురువారం వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు శాఖ, వ్యాయామ శాఖ ఆధ్వర్యంలో గురజాడ చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ యోగాంజనేయులు, తెలుగు శాఖాధిపతి డాక్టర్ నాగలక్ష్మిదేవి మాట్లాడుతూ ఆయన గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ నాగేంద్ర, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ తేజేంద్ర, న్యాక్ కో-ఆర్డినేటర్ రామకృష్ణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ సతీష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ సుధాకర్, వృక్షశాస్త్ర అధ్యాపకులు శ్రీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మల్లేశ్వరమ్మ, రాధిక, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ఎర్రగుంట్ల :** గురజాడ అప్పారావు జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం గురజాడ గీతాలాపన కరపత్రాల ఆవిష్కరణ, జయంతి కార్యక్రమాన్ని జన విజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు సుజన్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురజాడ దృష్టిలో దేశభక్తి అంటే మనుషులను ప్రేమించడమన్నారు. ఆకలిని నిర్మూలించడం దేశభక్తి అని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులురెడ్డి మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగంలో ముందడుగు వేయడమే నిజమైన దేశభక్తి అన్నారు. కార్యక్రమంలో జెవివి నాయకులు బాలకృష్ణ, సుబ్బయ్య, సుప్రదీప్, ఉపాధ్యాయులు ప్రభుకుమార్, చంద్రఓబుల్‌రెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** మహాకవి గురజాడ అప్పారావు కేవలం కవి మాత్రమే కాదని, ఆయన గొప్ప సంఘ సంస్కర్త అని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి అన్నారు. స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవాకేంద్రంలో గురువారం సాయంత్రం గురజాడ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, రచయితల సంఘం అధ్యక్షుడు జింకా సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఎల్‌టిఎ రాష్ట్ర కోశాధికారి గంగాధర్, విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ఓబులరెడ్డి పాల్గొన్నారు.


ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురజాడకు నివాళులు

ముమ్మరం.. నక్కలదిన్నె పిహెచ్‌సి నిర్మాణం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని నక్కలదిన్నెలో రూ.2.50 కోట్లతో నూతనంగా మంజూరైన పిహెచ్‌సి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 4802 చదరపు అడుగుల్లో నిర్మాణాన్ని చేపడతున్నారు. ఈ ఏడాది డిసెంబర్‌లో పిహెచ్‌సి నిర్మాణం పూరిచేసి, ప్రజలకు వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం ఇద్దరు వైద్యులు, ఎంపిహెచ్ఒను, సిబ్బందిని నియమించింది. ఆర్అండ్‌బి ఎఇ దాదాబాషా నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. ప్రహరీ పనులు, భవన నిర్మాణ పనులు సమాంతరంగా కొనసాగుతున్నాయి. పిహెచ్‌సి భవన నిర్మాణానికి అవసరమైన భూమిని ఎమ్మెల్యే సమీప బంధువు, కర్నూలు జెసి రామసుందర్‌రెడ్డి విరాళంగా అందించిన విషయం తెలిసిందే. పిహెచ్‌సి నిర్మాణం పూర్తయితే ప్రజలకు అందుబాటులోకి వస్తుంది. నక్కల దిన్నెతోపాటు చుట్టుపక్కల గ్రామాలైన తిప్పిరెడ్డిపల్లె, అనంతపురం, రాజువారిపేట, వెదురూరు, నరహరిపురం, ఎన్ ఓబాయపల్లె గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది.


కొనసాగుతున్న పిహెచ్‌సి నిర్మాణ పనులు

మొక్కల పెంపకం తప్పనిసరి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకం తప్పనిసరి అని మాజీ జడ్‌పిటిసి పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి తల్లి లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. వినాయక చవితి సందర్భంగా గురువారం హిమకుంటలోని చెరువు సమీపంలో రోడ్డుకు ఇరు వైపులా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు మొక్కలను నాటి వాటిని సంరక్షించడం అంటే తనకు ఎంతో సంతోషమన్నారు. మొక్కలు నాటడంతోపాటు ఇనుప గార్డులను ఏర్పాటు చేశారు.


మొక్కలు నాటుతున్న లక్ష్మీదేవమ్మ

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - చాపాడు

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నిరసనగా ఆ పార్టీ మైదుకూరు ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాల మేరకు చేపట్టిన రిలే నిరాహార దీక్షలో గురువారం ముస్లిం నాయకులు కూర్చున్నారు. మైదుకూరు టౌన్ టిడిపి అధ్యక్షులు పాల మాబు, రాష్ట్ర టిడిపి మైనార్టీ కార్యదర్శి ఫరూఖ్, టిడిపి నాయకులు సలీమ్‌బాషా, జిల్లా టిడిపి మైనార్టీ ప్రధాన కార్యదర్శి జండాల మహబూబ్ బాషా, జలీల్, ఉసేన్ షా, ఖదీరుల్లా, ఇస్మాయిల్, షబ్బీర్, కమలాపురం గౌస్, రాకెట్ రఫీ, నూర్, ఖాసిం, మెడికల్ షరీఫ్, ఇమామ్ పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : ఎనిమిది రోజుల తిరుమల పాదయాత్ర ముగించుకొని బుధవారం రాత్రి ప్రొద్దుటూరుకు చేరుకున్న టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి గురువారం ఆయన కార్యాలయం వెలుపల ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, 22వ వార్డు కౌన్సిలర్ గౌస్ మహమ్మద్, ప్రొద్దుటూరు మహిళా అధ్యక్షురాలు బి లక్ష్మీనారాయణమ్మ, సీనియర్ నాయకులు ఇవి సుధాకర్‌రెడ్డి, చిట్టే మధుబాబు, తిప్పిరెడ్డిపల్లి దస్తగిరి, పెద్ద ఎత్తున టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పాతబస్టాండ్‌లో 9వ రోజు గురువారం రిలే దీక్షలను ప్రారంభించారు. ఎస్‌టి సెల్ నియోజకవర్గ కార్యదర్శి హనుమంతు నాయక్, నరసింహ నాయక్, నాయకులు దీక్షలో కూర్చున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జమ్మలమడుగు నియోజవర్గం ఎస్‌టి సెల్ సోదరులు టిడిపి నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబం అభిమానులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ వసుంధర

బిటెక్ కోర్సుల్లో మార్పులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో గురువారం అంతర్జాలం ద్వారా బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జెఎన్‌టియు అనంతపురం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.రంగ జనార్ధన మాట్లాడుతూ బిటెక్ కోర్స్ స్ట్రక్చర్ రివిజన్ కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఆర్ 23 రెగ్యులేషన్స్ గురించి చర్చించామన్నారు. వీటిలో కొంత మేరకు మార్పులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ రెగ్యులేషన్స్‌లో మైనస్ డిగ్రీ, హానర్స్ డిగ్రీని రెగ్యులర్ డిగ్రీతోపాటు ప్రవేశపెడుతున్నామని తెలిపారు. ఈ సిలబస్‌లో 5 ప్రొఫెషనల్ ఎలక్టీవ్స్‌ను, 4 ఓపెన్ ఎలక్టీవ్స్‌ను, 5 స్కిల్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెడుతున్నామని వివరించారు. క్రెడిట్ ట్రాన్స్‌ఫర్ పాలసీని ప్రవేశపెడుతున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్. వసుంధర మాట్లాడుతూ ఆర్ 23 రెగ్యులేషన్స్‌తోపాటు మొదటి సంవత్సరం కోర్స్ స్ట్రక్చర్, సిలబస్.. రెండు, మూడు, నాలుగవ సంవత్సరాల కోర్స్ స్ట్రక్చర్ని రూపొందించుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎం.సూర్యనారాయణరెడ్డి, వివిధ డిపార్ట్‌మెంట్ల విభాగాధిపతులు, వివిధ ఎన్‌ఐటి, వివిధ ఐఐటి విద్యాసంస్థల ఆచార్యులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి మంచి జరగాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రతి కుటుంబానికి మంచి జరగాలని కాంట్రాక్టర్, వైసిపి నేత ముద్రా అమర్‌నాథ్‌రెడ్డి ఆకాంక్షించారు. గురువారం మండల పరిధిలోని పి. బొమ్మేపల్లెలో గణనాథుని లడ్డూ రూ.46 వేలుకు దక్కించున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఏడాది వినాయకుడి ఉత్సవం మరింత భారీగా నిర్వహిస్తామన్నారు. సర్పంచు, దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. వేలంలో పాడిన లడ్డూను గ్రామంలోని ప్రతి ఇంటికీ పంచి పెట్టామన్నారు.

ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆయిల్ ఫామ్ సాగుకు నీరు లభ్యత, నీరు ఇంకిపోయే నేలలు అనుకూలమని అధికారులు సూచించారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో గురువారం కల్లూరు, కామనూరు గ్రామాల్లోని రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లాలోని ఐదు మండలాలను ఆయిల్ ఫామ్ సాగుకు ప్రభుత్వం ఎంపిక చేసిందన్నారు. ప్రొద్దుటూరు, మైదుకూరు, బి. మఠం, కాశినాయన, పులి వెందుల మండలాలను ప్రభుత్వం గుర్తించిందన్నారు. సువేన్ ఆగ్రో ఇండస్ట్రీస్ కంపెనీకి జిల్లాలో ఆయిల్ ఫామ్ సాగుచేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిం దన్నారు. ఆయిల్ ఫామ్ సాగు రాయితీ వివరములు.. ఒక ఎకరాకు 50-60 మొక్కలు ఉచితంగా ఇస్తారు. ఎకరాకు ఎరువులకుగానూ రూ.2,100, ఒక ఎక రాకు అంతరపంటకు రూ.2,100, రైతు ఎన్ని ఎకరములు సాగు చేయడానికి ముందుకు వస్తే అన్నీ ఎకరాలకు రాయితీ లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సువేన్ కంపెనీ ప్రతినిధి కొండారెడ్డి, మాజీ సర్పంచు కల్లూరు నాగేంద్రరెడ్డి, ఉద్యాన అధికారి జయభరత్‌రెడ్డి, రైతు భరోసా కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో పాల్గొన్న రైతులు, అధికారులు

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ప్రజాశక్తి - వేంపల్లె

పాపాఘ్ని నది నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను గురువారం హనుమాన్ జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. వాహనాలను తనిఖీ చేయగా ఎలాంటి రికార్డులు లేని కారణంగా ట్రాక్టర్లను సీజ్ చేసి, వాటిని వేంపల్లె పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు.

గండి క్షేత్రంలో గణేష్ నిమజ్జనం

చక్రాయపేట : ప్రముఖ పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలో గురువారం గణేష్ నిమజ్జనోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా దేవస్థానం ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి పూజల అనంతరం మేళ తాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎసి అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ పినుపోలు రాఘవేంద్ర ప్రసాద్, ప్రధాన అర్చకులు కేసరి స్వామి, కార్యాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


గ్రామోత్సవంలో అధికారులు, గండి సిబ్బంది